భారతదేశంలో బ్రిటిష్ పాలన-వలస దోపిడి

భారతదేశంతో సహా మూడో ప్రపంచ దేశాలన్నీ అల్ప ఆర్థికాభివృద్ధిని కలిగి ఉన్నాయి. ఈ దేశాల్లో తక్కువ తలసరి ఆదాయం, సామూహిక పేదరికం, అల్ప పారిశ్రామికీకరణ, వ్యవసాయంపై అధికంగా ఆధార పడటం లాంటి వెనుకబాటు లక్షణాలు కనిపిస్తాయి. అల్పాభివృద్ధికి ఆయా దేశాల్లో సాంఘిక నిర్మాణం, మూఢనమ్మకాలు, అధిక జనాభా పెరుగుదల రేటు, మూలధనం, వ్యవస్థాపన నైపుణ్యం కొరత లాంటి అంశాలే కారణమని వలసవాదాన్ని సమర్థించే ఆర్థిక చరిత్రకారుల అభిప్రాయం. సామ్రాజ్యవాద దేశాలు అవలంభించిన విధానాలే ఆయా దేశాల వెనుకబాటుతనానికి కారణం అని దాదాభాయ్ నౌరోజీ, రమేష్ దత్, బి.ఎన్.గంగూలీ లాంటి వారు భిన్న అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు.

వలస వాదం (Colonialism):

వలసను స్థాపించిన దేశాన్ని Ruling Country అని, వలస స్థాపించ బడ్డ దేశాన్ని Colony అని పిలుస్తారు. ఈ రెండు దేశాల మధ్య గల రాజకీయ, సాంఘిక సంబంధాల విధానాన్నే వలస వాదం అంటారు. ఆర్థిక విధానాలు కూడా Ruling Countryకి అనుగుణంగా ఉంటా యి.

లక్షణాలు:

- వలసకు గురైన Colony ప్రజలు తమ దేశ వనరుల వినియోగంలో, వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధిలో, విదేశీ వ్యాపార విధానాల్లో, పన్నుల నిర్మాణం, ఇతర ఆర్థిక అంశాల్లో స్వతంత్ర నిర్ణయాలు తీసుకొనే వీలుండదు.
- కాలనీ (Colony) ఆర్థిక విధానాలన్నీ, పరిపాలిస్తున్న దేశ ఆర్థిక ఆశక్తులకు అనుగుణంగా ఉండటంతో, వాటి అభివృద్ధి ప్రక్రియ నిలిచిపోతుంది.
- వలస వాదంలో,(కాలనీ) వలసకు గురైన దేశాల ఆర్థిక వ్యవస్థ, వలస స్థాపించిన దేశాల ఆర్థిక వ్యవస్థతో మిళితమవుతుంది. కాలక్రమేణా ఈ రెండు ఆర్థిక వ్యవస్థలు ఒకదానికొకటి పరిపూర కంగా ఉంటాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో పశ్చిమ ఐరోపా దేశాలు వలసలను స్థాపించాయి. ఈ దేశాలు తమ పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించే దేశాలుగా, తమకు కావల్సిన ముడి సరుకులను సరఫరా చేసే దేశాలుగా వలస వాదానికి గురైన కాలనీలను తీర్చిదిద్దాయి. ఇంగ్లండ్ భారతదేశాన్ని కూడా అదేవిధంగా తయారు చేసింది.

బ్రిటిష్ పాలన-భారతదేశంలో వలస దోపిడి:

ప్లాసీ యుద్ధం తర్వాత బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ, భారతదేశంలో ఎక్కువ ప్రాంతాల్లో రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని వలస దోపిడీని ప్రారంభించింది. ఇండియా నుంచి ఇంగ్లండ్‌కు దేశ సంపద తరలిపోయింది. ఈస్టిండియా కంపెనీ అధికారం బ్రిటిష్ క్రౌన్ (British Crown)కి మార్పిడి అయినప్పటికీ విధానం మారింది కానీ దోపిడి ఆగలేదు. అంటే బ్రిటిష్ పాలన కాలమంతా దోపిడి ఒకే విధం గా లేదు. ఆర్థిక చరిత్రకారులు ఈ దోపిడి విధానాన్ని మూడు దశలుగా విభజిస్తారు.

- Period of merchant Capital (వర్తక మూలధన దోపిడి): ప్లాసీ యుద్ధం నుంచి 18వ శతాబ్దం చివరి వరకు
- Period of Industrial Capital (పారిశ్రామిక మూలధన దోపిడి): 19వ శతాబ్దం ప్రారంభం నుంచి శతాబ్దం చివరి వరకు
- Period of Finance Capital (విత్త మూలధన దోపిడి): 19వ శతాబ్దం చివరి నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు.

1. వలస దోపిడి-వర్తక మూలధనం:

ఈస్టిండియా కంపెనీ అధికారాన్ని స్థాపించే సమయానికి, మన ఆర్థిక వ్యవస్థ 'ఫ్యూడల్' లక్షణాలతో ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొ న్నట్లు మన దేశంలో అప్పటికే పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నట్లయితే బ్రిటిష్ జోక్యం సులభమయ్యేది కాదు. బ్రిటిష్ వర్తక మూలధనం వల్ల భారత పెట్టుబడిదారీ వర్గంపై పెద్ద దెబ్బే పడింది. ఈస్టిండియా కంపెనీ కింది పద్ధతుల ద్వారా ఈ దశలో దోపిడి చేసింది.

- భారతదేశంలో వ్యాపారం చేసి అధిక లాభాలు పొందాలనే ఉద్దేశం తో ఆంగ్ల కంపెనీ ప్రవేశించింది. యూరోప్‌లో డిమాండ్ ఉన్న వస్తువులను మన దేశంలో కొని, దానికి బదులుగా బంగారం, వెండి మన దేశానికిచ్చేవారు. అయితే ఈ బంగారం, వెండి మనకి వ్వడం ఆంగ్లేయులకు ఇష్టం ఉండేది కాదు. ప్లాసీ యుద్ధం ద్వారా రాజకీయ అధికారం స్థాపించడంతో, దాన్ని ఉపయోగించి భార తీయ రైతులు, వ్యాపారులపై ఒత్తిడి తీసుకొచ్చి, తక్కువ చెల్లింపు లతో గరిష్ట వస్తువులు పొందుతూ వినిమయాన్ని బ్రిటిష్ వారికి అనుకూలంగా మార్చుకున్నారు.
- 1793లో కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన భూ రెవెన్యూ (శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి) విధానం కూడా వారి దోపిడికి దోహదపడింది. యేటా 34,00,000 పౌండ్లు రావాలని శిస్తును నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ప్రజా సంక్షేమంపై ఖర్చు పెట్టకుండా కంపెనీ పెట్టుబడు లపై వచ్చిన లాభాలుగా భావించి ఇంగ్లండ్‌కు తరలించారు.
- కంపెనీ అధికారులు అవినీతిపరులై లంచాలు, కానుకలు, బహుమ తుల పేరుతో భారత సంపదను దోపిడి చేశారు. దీనికి రాబర్ట్ క్లైవ్

లాంటి వారు కూడా మినహాయింపు కాదు. సామాన్య సైనికుడిగా వచ్చిన క్లైవ్, మన దేశంలో కొద్దికాలం ఉన్నప్పటికీ, రెండున్నర లక్షల పౌండ్ల సంపద, మరికొన్ని ఎస్టేట్స్‌తో ఇంగ్లండ్‌కు తిరిగి వెళ్లాడు.

- బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ అధికారం పొందిన తర్వాత భూ రెవెన్యూ పెంచుకుంటూ పోతూ రైతులను దోపిడి చేశారు.

2. వలస దోపిడి -పారిశ్రామిక మూలధనం:

మొదటి దశలో ఇండియా నుంచి ఇంగ్లండ్‌కు జరిగిన సంపద తరలింపు, ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవానికి కొంతవరకు దోహదపడింది. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం సంభవించిన తర్వాత దోపిడి రూపం మారింది. ఈ కాలంలో బ్రిటిష్ పరిశ్రమలకు, ఇండియాను మార్కెట్‌గా మార్చారు. దోపిడి కింది పద్ధతుల్లో సాగింది.

- ఇంగ్లండ్‌లో భారతీయ వస్త్రాలకు మంచి డిమాండ్ ఉండేది. ఇంగ్లండ్‌లో ఉన్న వస్త్ర పరిశ్రమ, భారతీయ వస్త్రాలతో పోటీ పడలేకపోయేది. దీనినుంచి రక్షించడానికి ఇంగ్లండ్‌కు దిగుమతి అయ్యే భారత వస్తువులపై బ్రిటిష్ ప్రభుత్వం భారీ కస్టమ్స్ సుంకాలను 78 శాతం వరకు విధించింది. మరోవైపు ఇండియాకు దిగుమతి అయ్యే బ్రిటిష్ వస్తువులపై ఎలాంటి సుంకం విధించలేదు. దీనివల్ల ఇంగ్లండ్‌కు దిగుమతి అయ్యే ఇండియా వస్త్రాలు పరిమితమై, ఇండియాకు బ్రిటిష్ ఎగుమతులు పెరిగాయి.
- భౌగోళిక కారణాల దృష్ట్యా ఇంగ్లండ్‌లో స్థాపనకు వీలుకాని పరిశ్రమలను, ఇండియాలో స్థాపించేందుకు బ్రిటిష్ వారు సంసిద్ధులయ్యారు. వాటిలో జ్యూట్ పరిశ్రమ ముఖ్యమైంది. బెంగాల్‌లో జనపనార మిల్లుల్లో పెట్టుబడి ద్వారా అంతర్జాతీయ జ్యూట్ మార్కెట్లో ఆంగ్లేయులు ఏకస్వామ్యం పొంది, విపరీత లాభాలు ఆర్జించారు. జ్యూట్‌తో పాటు టీ, కాఫీ, నీలిమందు తోటల్లో కూడా ఆంగ్లేయులు పెట్టుబడి పెట్టారు. భారతీయ శ్రామికులను తక్కువ వేతనాలు, అధిక పని గంటలతో దోపిడి చేశారు.
- బ్రిటిష్ వారు తమ రాజకీయ అధికారాన్ని కాపాడుకొనేందుకు, పెద్ద సంఖ్యలో సైన్యాన్ని నిర్వహించాల్సివచ్చేది. ప్రభుత్వ వ్యయంలో 1/3 వంతు దీనిపైనే జరిగేది. సైనికాధికారుల పింఛన్లు, భారత రాజ్య కార్యదర్శి, అతని సలహామండలి, కార్యాలయ సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులు భారతీయులే భరించాల్సి వచ్చేది.

  ఈ కాలంలో జరిగిన దోపిడి ఆర్థిక వ్యవస్థ స్వరూపంలో విపరీతమైన మార్పు తీసుకొచ్చింది. స్వయంసమృద్ధి కలిగిన ఏకాంతమైన గ్రామాలు విచ్ఛిన్నమయ్యాయి. పట్టణాల్లో పారిశ్రామిక తిరోగమనంతో పరిశ్రమలు నశించాయి. వ్యవసాయం, పరిశ్రమల రంగాల్లో సమతౌల్యం దెబ్బతింది.

3. వలస దోపిడి- విత్తమూల ధనం:

బ్రిటిష్ మూలధనం విత్తం రూపంలో భారతదేశానికి వచ్చింది. దీనిలో ఎక్కువ భాగం గతంలో భారతదేశం నుంచి అక్రమంగా ఇంగ్లండ్‌కు తరలించిందే.

- రైల్వేల నిర్మాణానికి బ్రిటిష్ మూలధనాన్ని దిగుమతి చేశారు. దీనిపై చెల్లించే వడ్డీ భారతీయులే భరించారు. అమెరికాలో రైల్వేల నిర్మాణం వల్ల ఇనుము-ఉక్కు, బొగ్గు, మూలధన పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. కాని మన దేశంలో రైల్వేల నిర్మాణానికి అవసరమైన మూలధన వస్తువులన్నీ ఇంగ్లండ్ నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల అక్కడి పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.5 శాతం ప్రతిఫలాలు కనీసం చెల్లిస్తామనే గ్యారంటీ విధానంలో రైల్వేల నిర్మాణం చేపట్టారు. ఈ గ్యారంటీ వడ్డీరేటును భారతీయులే భరించాల్సి వచ్చింది.
- ఇంగ్లండ్ శీతోష్ణస్థితి పరిస్థితులకు టీ, కాఫీ, రబ్బరు తోటల పెంపకం అనువుగా లేకపోవడంతో, వాటిని బ్రిటిష్ వారు మన దేశంలో అభివృద్ధి చేసేందుకు పెట్టుబడి పెట్టారు. ఇండియన్ టీ అంతర్జాతీయ మార్కెట్లో ఏకస్వామ్య అధికారాన్ని సంపాదించి బ్రిటిష్ వారికి విపరీత లాభాలు తెచ్చి పెట్టింది.

- రైల్వేలు, పండ్ల తోటలతో పాటు మైనింగ్, ఆయిల్, బ్యాంకింగ్, రబ్బర్, అగ్గిపెట్టెలు, కాగితం, పంచదార పరిశ్రమల్లో కూడా బ్రిటిష్ మూలధనం కనిపిస్తుంది. అయితే ఇది చాలా తక్కువ శాతం మాత్రమే.

- భారత ప్రజలకు సంబంధం లేని బ్రిటిష్ వ్యయాన్ని, ఇండియా కిచ్చిన రుణాలుగా చూపించేవారు.

  ఉదా: 1857 సిపాయిల తిరుగుబాటును అణిచివేసేందుకు అయిన వ్యయం, కంపెనీ అధికారాన్ని, బ్రిటిష్ క్రౌన్‌కి బదిలీ చేసేటపుడు అయిన వ్యయం, చైనా, అబిసీనియా దేశాలతో బ్రిటిష్ యుద్ధాలకు అయిన వ్యయం భారతీయుల నుంచే వసూలు చేశారు.

  అంటే బ్రిటిష్ మూలధనం భారతదేశంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి దోహదపడలేదు.

బ్రిటిష్ పాలన-అల్పాభివృద్ధి:

- దాదాభాయ్ నౌరోజీ 'Poverty and un British Rule in India' అనే గ్రంథంలో 1867-68లో జాతీయాదాయం 340 కోట్లు, జనాభా 17 కోట్లని, తలసరి ఆదాయం 20/- రూ.గా అంచనా వేశారు.
- నౌరోజీ ప్రకారం బ్రిటిష్ పాలన పూర్వం కంటే బ్రిటిష్ పాలనా కాలంలోనే పేదరికం విస్తరించింది. చార్లెస్ ఇలియట్ పేర్కొన్నట్లు వ్యవసాయ జనాభాలో సగం మందికి సంపూర్ణ ఆహారం (Full Meal) అంటే తెలియదు.
- వ్యవసాయంపై ఆధారపడేవారి శాతం 60 నుంచి 73కు పెరిగింది.
- భారతీయులకు అంతగా ఉపయోగపడని రైల్వేలపై అధికంగా, నీటిపారుదలపై (70 శాతం వ్యవసాయంపైనే ఆధారపడుతున్న రంగం) తక్కువ నిధులు ఖర్చు చేశారు.

- చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు క్షీణించాయి.
- విదేశీ వ్యాపారం వెనుకబడి ఎగుమతుల్లో అధికభాగం ముడి సరుకులు, దిగుమతుల్లో అధిక భాగం తయారైన వస్తువులు ఉండేవి.

భారత ఆర్థిక వ్యవస్థ-బ్రిటిష్ పాలన ప్రభావం

బ్రిటిష్ వారు రాకపూర్వం భారత ఆర్థిక వ్యవస్థలో ఏకాంతమైన, స్వయంసమృద్ధి కలిగిన గ్రామాలు ఓవైపు, పరిపాలన, తీర్థయాత్ర, వాణిజ్య కేంద్రాలుగా గల పట్టణాలు మరొక వైపు ఉండేవి. అప్పటి భారత ఆర్థిక వ్యవస్థను అవగాహన చేసుకోవడానికి నాటి గ్రామీణ, పట్టణ నిర్మాణం, చేతివృత్తులు, పరిశ్రమలను పరిశీలించాలి.

గ్రామాల నిర్మాణం:

గ్రామాలు సామాన్య శ్రమ విభజన సూత్రంపై ఆధారపడి ఉండేవి. రైతులు వ్యవసాయం చేస్తూ, ఉత్పత్తిలో కొంతభాగాన్ని తమకు సహాయపడే కుమ్మరి, కమ్మరి, బంగారు పని, రజక, క్షౌర, మొదలైన వివిధ వృత్తులవారికి అందిస్తూ సహకార ప్రాతిపదికన జీవించేవారు. వ్యవసాయం, చేతి పరిశ్రమలు, పరస్పరం సహ సంబంధం కలిగి ఉండేవి. ఫలితంగా బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా గ్రామాలు తమ విధులను స్వతంత్రంగా నిర్వహించుకునే వీలుండేది. ''చార్లెస్ మెట్ కాఫ్'' నాటి గ్రామ సముదాయాలు చిన్న రిపబ్లిక్‌లా, తమ అవసరాలు తామే తీర్చుకుంటూ స్వతంత్రంగా ఉండేవని పేర్కొన్నాడు.'' తమ పాలకుడు నవాబైనా, హిందూ రాజైన పంటలో కొంత భాగాన్ని గ్రామాలు శిస్తుగా చెల్లించేవి. గ్రామాల్లో వ్యవసాయదారులు, వృత్తి కళాకారులు, గ్రామాధికారులు అనే మూడు వర్గాల వారుండేవారు. రైతులు పరపతి అవసరాలను తమ పొదుపుల నుంచి గాని, వడ్డీ వ్యాపారస్తుల నుంచి గాని తీర్చుకొనేవారు. స్థానిక సమస్యలను పంచాయితీలే పరిష్కరించేవి.

పట్టణ నిర్మాణం:

పట్టణాలు ప్రధానంగా మూడు కారణాలతో ఏర్పడ్డాయి. తీర్థయాత్ర స్థలాలుగా కొన్ని పట్ట ణాలు అభివృద్ధి చెందాయి.

ఉదాహరణ: అలహాబాద్, బెనారస్, గయ, పూరి, నాసిక్. మరి కొన్ని ప్రాంతాలు స్థానిక ప్రాంతాల రాజధానులుగా అభివృద్ధి చెందాయి.

ఉదాహరణ: ఢిల్లీ, లాహోర్, పుణే, లక్నో, తంజావూర్.

మరికొన్ని పట్టణాలు వర్తక, వాణిజ్య కేంద్రాలు వృద్ధి చెందడం వల్ల వెలిశాయి.

ఉదాహరణ: బెంగళూర్, హుగ్లీ, మీర్జాపూర్ మొదలైనవి.

గ్రామీణ జీవన విధానానికి వైవిధ్యంగా పట్టణాలుండేవి. వివిధ రకాల వృత్తులు, వ్యాపారాలు పట్టణాల్లో ఉండేవి. విస్తృత మార్కెట్‌ని కలిగి ఉండేవి.

పరిశ్రమలు, చేతివృత్తులు:

భారతదేశం ఎప్పుడూ పారిశ్రామిక దేశంగా లేదనడం సరికాదు. వ్యవసాయాధిపత్యం గల దేశమైనప్పటికీ పారిశ్రామిక ఉత్పత్తులకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచి ఉండేది.

ఉదాహరణ: ఢాకా మస్లిన్‌లు, బెంగాల్ కాలికోట, బెనారస్ చీరలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయి. క్రీ.పూ. 2000లోనే ఈజిప్టు మమ్మీలలో భారత మస్లిన్ వస్త్రాలను వాడేవారు. ''20 గజాల పొడవు, ఒక గజం వెడల్పు గల మస్లిన్ వస్త్రం చేతి ఉంగరంలో నుంచి తియ్యగలిగేంత సన్నగా నేసేవారని, దీని తయారీకి ఆరు నెలలు పట్టేదని టి.ఎన్. ముఖర్జీ పేర్కొన్నారు''. 17, 18 శతాబ్దాల్లో భారత పారిశ్రామిక ఉత్పత్తులకు ఐరోపా వినియోగదారుగా ఉండేది. 1918లో పారిశ్రామిక కమిషన్ చెప్పినట్లు ''ఆధునిక పారిశ్రామిక దేశాలుగా ఇప్పుడు రాణిస్తున్న పశ్చిమ ఐరోపా దేశాలు అనాగరికంగా ఉన్నప్పుడు భారత దేశం కళాత్మక చేతిపనివాళ్లకు, భోగ, భాగ్యాలతో తులతూగే పాలకులకు ప్రసిద్ధి గాంచి ఉండేది. తర్వాత కాలంలో ఐరోపా వర్తకులు భారతదేశానికి వచ్చినప్పుడు కూడా ఆ దేశాల పారిశ్రామికీకరణ స్థాయి కంటే భారత పారిశ్రామికీకరణ స్థాయి ఏ మాత్రం తక్కువగా ఉండేది కాదు''.

బ్రిటిష్ పాలన-ఆర్థిక పరిణామం:

బ్రిటిష్ వారికి పూర్వం భారతదేశంపై దండెత్తిన విదేశీయులు భారత గడ్డపైనే స్థిరపడి, ఇక్కడి సంస్కృతిలో భాగమైపోయారు. కానీ బ్రిటిష్ వారు మాత్రం మొదట నుంచి మాతృదేశానికి అనుగుణంగానే రాజకీయ, ఆర్థిక విధానాలను రూపొందించారు. వీరి పాలన ఫలితంగా చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలు క్షీణించాయి. వ్యవసాయం వాణిజ్యీకరణమైంది. నూతన రెవెన్యూ విధానం వల్ల మధ్యవర్తులు ఏర్పడ్డారు. కరువు కాటకాలు పెరిగాయి. సంపద దోపిడీకి గురైంది. వీరి కాలంలో రైల్వేల అభివృద్ధి, నీటిపారుదల, విద్యా విస్తరణ, రెవెన్యూ విధానం కూడా మన దేశం నుంచి ఆర్థిక సంపద తరలింపునకే దోహదపడింది.

1. చేతివృత్తుల క్షీణత-గ్రామాల అభివృద్ధి:

ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం సంభవించక పూర్వం మన దేశంలో గల వస్త్రాలను, సుగంధ ద్రవ్యాలను ఐరోపాకు ఎగుమతి చేసి ఈస్టిండియా కంపెనీ వారు విపరీతంగా లాభాలు సంపాదించేవారు. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం సంభవించడంతో ఆంగ్లేయుల వ్యాపార రీతిలో మార్పు వచ్చింది. ఇంగ్లండ్‌లో గల పరిశ్రమలకు అవసర

మయ్యే ముడిసరుకులను మన దేశం నుంచి ఎగుమతి చేసి యంత్రాలపై తయారైన వస్తువులను సుంకం లేకుండా దిగుమతి చేసేవారు. ఫలితంగా వాటితో పోటీ పడలేక మన దేశంలో గల చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు క్షీణించాయి.

క్షీణతకు కారణాలు:

- కళాకారులను ఆదరించే స్థానిక రాజులు అదృశ్యమవడం.
- 1882-1894 మధ్య బ్రిటిష్ ప్రభుత్వం స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని అవలంభించడం.
- ఇంగ్లండ్‌లో యంత్రాలతో తయారైన వస్తువులతో, కుటీర పరిశ్రమల్లో తయారైన వస్తువులు పోటీపడలేకపోవడం.
- ఆంగ్ల విద్య వల్ల బ్రిటిష్ వారి వస్తువులను అనుకరించే ఒక నూతన వర్గం ఆవిర్భవించడం.
- 1869 సూయజ్ కాలువ తెరవడంతో రవాణా వ్యయం తగ్గి బ్రిటిష్ వస్తువులు భారతీయ మార్కెట్‌ను ఆక్రమించడం.

పై కారణాల వల్ల భారత్‌లో చేతివృత్తులు క్షీణించి నిరుద్యోగిత పెరిగింది. ముఖ్యంగా భారత వస్త్ర పరిశ్రమ ఎక్కువ నష్టానికి గురైంది. 1834లో విలియం బెంటిక్ పేర్కొన్నట్లు ''భారత మైదాన ప్రాంతం చేనేత పని వల్ల ఎముకలతో నిండి ఉంది''. అని పేర్కొన్నారు. చేతివృత్తుల క్షీణత, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఉపాధి కోల్పోయిన వృత్తి పనివారు తిరిగి వ్యవసాయానికి తరలిపోయారు. వ్యవసాయంపై ఆధారపడ్డ అనుపాతం పెరిగింది. దీన్ని ''గ్రామాల పురోగమనం'' (Progressive Ruralisation) లేదా పారిశ్రామిక తిరోగమనం (Deindustrilization) అంటారు.

19వ శతాబ్దం మధ్యలో వ్యవసాయంపై 55 శాతం మంది ఆధారపడగా, 1931 నాటికి 72 శాతానికి పెరిగింది. ఫలితంగా కమతాల విభజన, విఘటన జరిగి భూమికి చెల్లించే బాటకం పెరిగి భూమి లేని శ్రామికులు ఎక్కువయ్యారు.

2. భూ విధానం (రెవెన్యూ విధానం):

ఈస్టిండియా కంపెనీ వారు అత్యధిక రెవెన్యూను రాబట్టేందుకు ప్రయత్నించారు. వ్యవసాయ రంగంలో స్థిరమైన ఆదాయాన్ని పొందడానికి 1793లో బెంగాల్‌లో ''శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతిని'' కారన్ వాలీస్ ప్రవేశపెట్టాడు. దీన్ని జమీందారీ విధానం అని కూడా అంటారు. ప్రభుత్వానికి, భూమి దున్నే రైతులకు మధ్య జమీందారీ మధ్యవర్తిగా ఉంటాడు. వ్యవసాయాభివృద్ధికి ఈ విధానం దోహదపడలేదు. అయితే బ్రిటిష్ వారికి అనుకూలమైన ఒక వర్గాన్ని మాత్రం ఏర్పాటు చేసుకోగలిగింది. బొంబాయి, మద్రాస్ ప్రాంతాల్లో థామస్ మన్రో ప్రవేశపెట్టిన రైత్వారీ విధానం కూడా తన అసలు స్వరూపం కోల్పోయి రైతు నుంచి అధిక శిస్తును ఆశించింది. అయోధ్య, ఆగ్రా ప్రాంతాల్లో ముస్లిం సంప్రదాయాలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన మహళ్వారీ విధానంలో కూడా మధ్యవర్తులుండటం వల్ల రైతులు అధిక శిస్తు చెల్లించాల్సి ఉండేది. మొత్తం మీద ఈ నూతన రెవెన్యూ విధానం వల్ల రైతులు అధిక శిస్తును భరించలేక కొంత భూమిని భూస్వాములకు, వడ్డీ వ్యాపారస్తులకు అమ్మవలసి వచ్చింది. ఫలితంగా అనుపస్థిత భూస్వాములు (Absentee Landlords) పెరిగారు.

3. వ్యవసాయ-వాణిజ్యీకరణ:

వ్యవసాయోత్పత్తులను కుటుంబ వినియోగానికి కాక, అమ్మేందుకు ఉత్పత్తి చేస్తే దాన్ని వాణిజ్యీకరణ అంటారు. ప్రతి దేశ ఆర్థిక చరిత్రలో వ్యవసాయ వాణిజ్యీకరణం సహజమే అయినప్పటికీ మన దేశంలో బ్రిటిష్ వారి ఒత్తిడి వల్ల ఇది సంభవించింది. 19వ శతాబ్దం మధ్య నాటికి ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం పూర్తయింది. పత్తి, జనుము, పంచదార, వేరుశెనగ లాంటి ముడి పదార్థాలకు ఇంగ్లండ్‌లో విపరీతమైన డిమాండ్ పెరిగింది. రైతులు ఆహార పంటలకు బదులు అధిక ధరలు వస్తాయనే నమ్మకంతో వాణిజ్య పంటలు పండించడం ప్రారంభించారు. వ్యవసాయదారులు ఆహారధాన్యాలను పండించడానికి బదులు మండీలు (Mandis) నుంచి కొనడం ప్రారంభించారు.

బ్రిటిష్ వారు భూ రెవెన్యూ విధానంలో అధిక శిస్తు వసూలు చేయడం కూడా రైతులు వాణిజ్య పంటల వైపు మరలడానికి కారణమైంది. ఫలితంగా ఆహారధాన్యాల కొరత ఏర్పడింది. ఇదే కాలంలో కరువు, కాటకాలు కూడా పెరిగాయి.

- వ్యవసాయం వాణిజ్యీకరణ అవడం వల్ల దేశం నలుమూలల పండిన ముడి పదార్థాలను సేకరించేందుకు బ్రిటిష్ వారికి రైల్వేలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడింది. రైల్వేలు, పోర్టులను, పట్టణ కేంద్రాలను కలుపుతూ భారత వ్యవసాయోత్పత్తులను ప్రపంచవ్యాప్తం చేశారు. పంజాబ్ నుంచి గోధుమ, బెంగాల్ నుంచి జనుము, ముంబై నుంచి పత్తి సేకరించి ఇంగ్లండ్‌కు ఎగుమతి చేసేవారు. ఇంగ్లండ్‌లో తయారైన వస్తువులు తిరిగి దేశం నలుమూలల పంపించేందుకు కూడా ఈ రైల్వేలు ఉపయోగపడ్డాయి. ఫలితంగా వ్యవసాయ వాణిజ్యీకరణ వైపు, భారత పరిశ్రమల క్షీణత మరోవైపు సంభవించింది.

4. కరువు కాటకాలు:

నూతన భూ రెవెన్యూ విధానం, వ్యవసాయ వాణిజ్యీకరణ ఆర్థిక వ్యవస్థపై చెడు ఫలితం చూపి కరువు కాటకాలు పెరిగాయి. ఈస్టిండియా కంపెనీ కాలంలో 12 కరువులు సంభవించగా 1858 తర్వాత బ్రిటిష్ క్రౌన్ (British Crown) కాలంలో వీటి సంఖ్య పెరిగింది. 1943 బెంగాల్ కరువు అతి భయంకరమైంది. కరువు పరిశీలన సంఘం అంచనాల ప్రకారం బెంగాల్ కరువులో 1.5 మిలియన్ల మంది చనిపోయారు. అనధికార లెక్కల ప్రకారం ఇది 3.5 మిలియన్లుగా ఉంది. బ్రిటిష్ వారు రైల్వేలు వంటి ఆధునిక రవాణా సదుపాయాలు ప్రవేశపెట్టక పూర్వం కరువులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యేవి. మరొక ప్రాంతంలో ఆహార ధాన్యాలున్నప్పటికీ సరైన రవాణా సౌకర్యాలు లేక కరువు ప్రాంతానికి అందుబాటులోకి వచ్చేవి కావు. బ్రిటిష్ వారి రైల్వేల నిర్మాణంతో కరువు స్వభావంలో మార్పు

వచ్చింది. బ్రిటిష్ పాలన కాలంలో చేతి వృత్తులు క్షీణించి నిరుద్యోగిత పెరగడం వల్ల, వ్యవసాయం వాణిజ్యీకరణ జరగడంతో ఆహార పదార్థాల ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగాయి. దాంతో ఆహార పదార్థాలున్నప్పటికీ పేదలు వాటిని కొనలేకపోయేవారు. అందువల్ల బ్రిటిష్ వారు రాక పూర్వం ఉన్న కరువును ఆహార కరువని, బ్రిటిష్ వారు వచ్చిన తర్వాత ఏర్పడిన కరువుని ''కొనుగోలు శక్తి కరువని'' (Purchasing Power Famines) వర్ణిస్తారు.

5. పారిశ్రామిక పరిణామ ప్రక్రియ:

బ్రిటిష్ వారి కాలంలో పారిశ్రామికీకరణ ప్రైవేట్ రంగం ద్వారా జరిగింది. దీన్ని 19వ శతాబ్దపు పారిశ్రామిక వృద్ధి, 20వ శతాబ్దపు పారిశ్రామిక వృద్ధి అని రెండు రకాలుగా విభజిస్తారు. 19వ శతాబ్దపు పారిశ్రామిక పరిణామాన్ని పరిశీలిస్తే స్వదేశీ పరిశ్రమలు క్షీణించాయి. కొన్ని పెద్ద పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులే స్థాపించారు. 1850-55 మధ్య వస్త్ర పరిశ్రమ, జనపనార పరిశ్రమ, మొదటి కోల్‌మైన్ ప్రారంభించారు. 1853 లో బొంబాయి నుంచి థాణాకు మొదటి రైల్వే లైన్ నిర్మించారు. మొత్తం మీద ఇండియాలో వర్తకులు ఎక్కువగా వడ్డీ వ్యాపార స్వభావం కలిగి ఉండటం వల్ల పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపించలేదు. 20వ శతాబ్ద ప్రారంభం నాటి పారిశ్రామిక వృద్ధిని పరిశీలిస్తే 1905 స్వదేశీ ఉద్యమం వల్ల కొన్ని కొత్త పరిశ్రమలను స్థాపించారు. 1907లో జంషెడ్‌పూర్‌లో టాటా ఇనుము-ఉక్కు కర్మాగారం స్థాపించారు. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో భారతీయ వస్తువులకు డిమాండ్ పెరిగింది. మొదటి 'ఫిస్‌కల్ కమిషన్' సిఫార్సుల వల్ల 1924-39 మధ్య ఇనుము-ఉక్కు కర్మాగారం, వస్త్ర, జనపనార, పంచదార, కాగితం, అగ్గిపెట్టెల పరిశ్రమలకు ప్రభుత్వం రక్షణ కల్పించింది. ఫలితంగా భారతీయ పరిశ్రమలు దేశీయ మార్కెట్‌ను ఆక్రమించాయి. 2వ ప్రపంచ యుద్ధకాలంలో కూడా కొత్త పరిశ్రమలు స్థాపించారు. మొత్తంమీద బ్రిటిష్ పాలనలో మూలధనం కొరత, బ్యాంకింగ్ రంగం అభివృద్ధి కాకపోవడం, ప్రభుత్వ మద్దతు లేకపోవడం, భారతీయుల్లో వ్యవస్థాపన సామర్థ్యం కొరత వల్ల పరిశ్రమలు విస్తరించలేదనే చెప్పాలి.

మాదిరి ప్రశ్నలు

1.భారతదేశంలో లార్డ్ కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన పద్ధతి?

(గ్రూప్-2, 2008)

ఎ) జమీందారీ　　బి) మహల్‌వారీ

సి) మునసబ్‌దారీ　　డి) రైత్వారీ　　**(ఎ)**

2.1853లో భారతదేశంలో మొట్టమొదటి రైలు ప్రయాణం ఎక్కడి నుంచి ఎక్కడి ప్రారంభించారు?

(గ్రూప్-2, 2008)

ఎ) బొంబాయి నుంచి థాణె　　బి) ఢిల్లీ నుంచి మీరట్

సి) హౌరా నుంచి బర్‌ద్వాన్　　డి) బొంబాయి నుంచి ఢిల్లీ

(ఎ)